క్లుప్తంగా

రేపటి ధర్నాకు తరలిరావాలి

ఐనవోలు : ఆంక్షలు లేకుండా ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాంకేతిక కారణాల పేరుతో కాలయాపన చేయకుండా అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సన్మానం



ఐనవోలు : మండలంలోని నందనం గ్రామానికి చెందిన దుబ్బ శ్రీనివాస్ ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య మహాసభ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు సతీశ్‌కుమార్, కార్యదర్శి సత్యనారాయణ, మురళి, శ్రీనివాస్, శ్రీను, సంపత్, నరేందర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నర్సంపేట : మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. విద్యుత్ స్తంభాలను తాకొద్దని, చెట్ల కింద, శిథిలమైన భవనాల నీడన, లోతట్టు ప్రాంతాల్లో ఉండకూడదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆపత్కాలంలో అధికారులు తక్షణమే సహాయక చర్యలు తీసుకుంటారని తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట : కాజీపేటలో నాగ మహేశ్ శీతోఖాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలో నర్సంపేట శీతోకాన్ జపాన్ కరాటే డు ఇండియా హంబు సంస్థ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ షిహాన్ రచ్చ భవానీచంద్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. తొమ్మిదేళ్ల బాలికల విభాగంలో తపస్వి బంగారు, పదేళ్ల విభాగంలో అభిజ్ఞ వెండి, ఏడేళ్ల బాలుర విభాగంలో మనీశ్ బంగారు, పదేళ్ల శివప్రసాద్ బంగారు, 12 ఏళ్ల విభాగంలో గురుచరణ్ బంగారు, 13 ఏళ్ల విభాగంలో రాంచరణ్ బంగారు, తొమ్మిదేళ్ల సుధాంశ్ వెండి పతకాలు సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన వారిని సంస్థ ఇండియా చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహన్ రచ్చ శ్రీనుబాబు అభినందించారు.

మద్యం స్వాధీనం

పర్వతగిరి : మండలంలోని ముంజాలకుంట తండాలోని ఓ కిరాణా షాపులో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై ఎల్.రవీందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కిరాణా షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని సమాచారం అందడంతో ముంజాలకుంటతండాలో పోలీసు సిబ్బంది రమేశ్, రాజుతో కలిసి ఏఎస్సై రవీందర్‌రెడ్డి బాదావత్ కౌసల్యకు చెందిన షాపుపై దాడి చేశారు. పోలీసులను చూసి కౌసల్య పారిపోతుండగా అదుపులోకి తీసుకుని రూ.7,780 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. కౌసల్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పరామర్శ

నర్సంపేట : పట్టణానికి చెందిన న్యాయవాది, బీఆర్‌ఎస్ నాయకుడు గూళ్ల అశోక్‌కుమార్ గతేడాది మృతి చెందగా ఆయన కుటుంబాన్ని నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు. తొలుత అశోక్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. అశోక్ లేని లోటు పార్టీలో కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహరాములు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు, న్యాయవాదులు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు-కారు ఢీ

పర్వతగిరి : మండలంలోని కల్లెడలోని ఆకేరు వాగు బ్రిడ్జి వద్ద అన్నారం షరీఫ్ నుంచి వరంగల్ దిశగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు పర్వతగిరి నుంచి అన్నారం వైపు వెళ్తున్న కారు ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదని స్థానికులు తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

దంచికొట్టిన వాన

జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాలు, గ్రామాల్లో ఆదివారం వర్షం దంచికొట్టింది. చెరువులు, కుంటలు నిండుకున్నాయి. రహదారులు జలమయమయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు బయటికెళ్లొదని అధికారులు సూచించారు. చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.

- సాక్షి నెట్‌వర్క్



పరకాల : జలమయమైన మల్లారెడ్డిపల్లి వీధి



ధర్మసాగర్ : వరద తీవ్రతకు తెగిన రోడ్డు

ఎల్కతుర్తి : పీహెచ్‌సీలోకి చేరిన వరదనీరు





దామెర : లోలెవల్ వంతెన వద్ద అడ్డుగా ఉంచిన ట్రాలీ



వేలేరు : పీచరలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

అటెన్షన్ ప్లీజ్

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా



మండల కేంద్రం నుంచి తాటి వనం మీదుగా కన్నూరుకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారింది. వాహనదారులకు పాట్లు తప్పడం లేదు. గతంలో ఏర్పడ్డ పెద్ద గుంతలను రేణుకా ఎల్లమ్మ బోనాల సందర్భంగా గౌడ కులస్తులు మొరం పోసి తాత్కాలికంగా పూడ్చివేశారు. ఇటీవల కురిసిన వర్షానికి మొరం కొట్టుకుపోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మర్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- కమలాపూర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : రమేశ్, పంచాయతీరాజ్ ఏఈ
ఫోన్‌నంబర్ : 9440206430

ఆలయంలో శ్రావణమాస పూజలు



వీరభద్రుడి సన్నిధిలో సామూహిక రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు మొగిలిపాలేం రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, భద్రకాళి అమ్మవారికి నవావరణ అర్చనతో పాటు కుంకుమార్చన, సామూహిక రుద్రహోమం నిర్వహించారు. ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు వినయ్‌శర్మ, సందీప్‌శర్మ, వీరభద్రయ్య పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

● సీఐ రంజిత్‌రావు

శాయంపేట / దామెర : రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని శాయంపేట సీఐ రంజిత్‌రావు సూచించారు. ఆదివారం శాయంపేట, దామెర పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా, ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని అన్నారు. గణపతి విగ్రహం ఎత్తు, ఏర్పాటు చేయనున్న ప్రదేశం, నిమజ్జనం చేసే తేదీ, తదితర సమాచారంతో టీఎస్‌పోలీస్.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కమలాపూర్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఆదివారం ప్రకటనలో సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండాయని, ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని కోరారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండవద్దని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడినా, విద్యుత్ వైర్లు తెగిపడినా విద్యుత్ శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, రైతులు కరెంటు మోటార్లు, స్టార్టర్ల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కంఠాత్మకూర్ వద్ద రోడ్డుపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున హనుమకొండ నుంచి అంబాల మీదుగా పరకాలకు వెళ్లే ప్రయాణికులు అంబాల, గూనిపర్తి, మాదన్నపేట, శనిగరం మీదుగా పరకాలకు వెళ్లాలని, పరకాల నుంచి అంబాల మీదుగా హనుమకొండకు వెళ్లే ప్రయాణికులు శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి, అంబాల మీదుగా హనుమకొండకు వెళ్లాలని సూచించారు.

మల్లన్న ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు

ఐనవోలు : ప్రఖ్యాతి ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నిత్యపూజల అనంతరం అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఒగ్గు పూజారులు స్వామి వారికి ఎదురుగా నజరు పట్నం వేసి ఒగ్గు పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్‌శర్మ, వేద పండితుడు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ఘనంగా ఎమ్మెల్యే 'రేవూరి' జన్మదిన వేడుకలు



ఆత్మకూరు : చీరెలు పంపిణీ చేస్తున్న రవీందర్‌గౌడ్

ఆత్మకూరు / పరకాల / దామెర : ఆత్మకూరు మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం 100 మంది మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, నాయకులు బాబుమియా, రాజు, రవి, రాజేందర్, సామెల్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్ నాయకులతో కలిసి పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు. రేవూరిని సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అలాగే దామెర మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు బిల్లా రమణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

బాధితులకు 'జంగా' పరామర్శ



వేలేరు : మండల కేంద్రానికి చెందిన కూరపాటి వెంకటమ్మ, ఎండీ యాకుబ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కొంత ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తిరుపతిరెడ్డి ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, నాయకులు బుచ్చిరెడ్డి, జుర్రు సంపత్, రాజమల్లయ్య, అనిల్, రణధీర్ రెడ్డి, సలీం మాలిక్, ప్రశాంత్ ఉన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



పరశురాములు

వేలేరు : మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. పీచర గ్రామానికి చెందిన బూస పరశురాములు వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం ఇంట్లో ఫంక్షన్ ఉండటంతో మద్యం తాగొద్దని భార్య, కుమారుడు చెప్పడంతో వారితో గొడవపడ్డాడు. సాయంత్రం 4.30 గంటలకు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎద్దు తోక కత్తిరించిన ఆకతాయి



ఐనవోలు: గుర్తు తెలియని వ్యక్తులు ఎద్దు తోకను కత్తిరించారు. బాధితుడు కోలా ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తన చెలుక వద్ద రెండు ఎడ్లు, గేదె దూడను కట్టేసి ఉంచాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని ఆకతాయిలు ఎద్దు తోకను కత్తిరించారు. మూగ జీవిని క్రూరంగా హింసించిన ఆకతాయిని పట్టుకుని శిక్షించాలని బాధిత రైతు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ సహజం



మహిపాల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సమాజంలో పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో రాణించి ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసిన ఉపాధ్యాయుడు మహిపాల్‌రెడ్డి సేవలు గొప్పవన్నారు. రేగొండ మండలం కనిపర్తి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన మాదిరెడ్డి మహిపాల్‌రెడ్డి సన్మాన కార్యక్రమం ఆదివారం హనుమకొండలోని ఓ గార్డెన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల జీవితాన్ని బంగారు బాటలో నడిపించే ఏకైక వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు విరమణలు, బదిలీలు సహజమని, పనిచేసిన చోటు మంచి పేరు తెచ్చుకోవడంలో ఉన్న ఆనందం మరెక్కడ దొరకదని అన్నారు. అనంతరం మహిపాల్‌రెడ్డి దంపతులను పూలమాలలు, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మండల నాయకులు చిందం రవి, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శాయంపేట : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఐనవోలు : ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక ఎస్‌వీకేకే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమతో పాటు చదువుకుని పరలోకాలకు వెళ్లిన తోటి స్నేహితులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రవ్వ అంజయ్య, జిల్లెల్ల జనార్దన్‌రెడ్డి, కల్లెడ రఘుపతిరెడ్డి, వనం సదానందం, పార్వతిదేవి, సత్యనారాయణ, సుదర్శన్, సదానందరావు, చంద్రమౌళి, భాషాచార్యులు, శ్రీనివాస్‌ను పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. నిర్వాహణ కమిటీ కన్వీనర్ శాగంటి స్వామి, కో కన్వీనర్స్, బాసాని విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1985–86లో 10 వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 38 సంవత్సరాల అనంతరం స్నేహితులందరూ ఒకచోట చేరుకుని పాఠశాల స్మృతులను నెమరువేసుకున్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు దశరథం, ఆనందబాబును ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు గణేశ్, శ్రీనివాస్, విజయభాస్కర్, ఎల్లగౌడ్, సారంగపాణి, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

రంగాయ చెరువు రీడిజైన్‌తో నష్టం

● ఎమ్మెల్యే దిష్టిబొమ్మతో శవయాత్ర, దహనం



దిష్టిబొమ్మను శవయాత్రకు సిద్ధం చేస్తున్న రైతులు

నల్లబెల్లి : రంగాయచెరువు రీడిజైన్ చేస్తే రైతులకు నష్టం వాటిల్లుతుందని మండలంలోని కొండాపూర్, మూడుచెక్కలపల్లి, ఎర్రచెరువుతండా గ్రామాలకు చెందిన గిరిజన రైతులు వాపోయారు. మండలంలోని మూడుచెక్కలపల్లి, కొండాపూర్ గ్రామాల్లో గిరిజన రైతులు ఆదివారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆలోచన మేరకు టీఎంసీ సామర్థ్యంతో రంగాయచెరువు రిజర్వాయర్‌కు నిర్మాణ పనులు చేపడితే మూడుచెక్కలపల్లి, గోవిందాపూర్, లక్ష్మితండా, ఆసరవెల్లి, లైన్‌తండా, కొండాపూర్ గ్రామాలకు ముంపునకు గురై ఖాళీ చేయాల్సిన దుస్థితి నెలకొంటుందని ఆందోళన వెలిబుచ్చారు. రీడిజైన్ ఆలోచన మానుకోవాలని హితవు పలికారు. పేదల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేసే దిశగా ఆలోచించడం సరికాదన్నారు. రీడిజైన్ ఆలోచన మానుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కేసు నమోదు

ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో దేవాదుల ప్రాజెక్టుపై ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడిన మాటలను వక్రీకరించి ఆసరవెల్లిలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మితండా, రాంపూర్, ఆసరవెల్లి గ్రామాలకు చెందిన లావుడ్యా తిరుపతి, గాదం రాజ్ కుమార్, గుండెబోయిన సాంబయ్య, అజ్మీర బాసు, పనికర రాజు, బాదవత్ బాలు, రాజబోయిన ప్రవీణ్‌లు సోషల్ మీడియాలో ఎమ్మెల్యే మాధవరెడ్డిని వ్యక్తిగతంగా తీవ్రంగా పరుష పదజాలంతో దూషిస్తూ తప్పుడు ప్రచారం చేశారని బిల్ నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ చరణ్ సింగ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మిత్రుడి చికిత్సకోసం ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ప్రియప్రసన్నకుమార్

దామెర : మిత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడన్న విషయం తెలుసుకున్న స్నేహితురాలు ఆర్థికంగా ఆదుకున్నారు. మండల కేంద్రానికి చెందిన కదం రవి కొంతకాలంగా బ్రెయిన్ స్ట్రోక్, గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. కాగా ఎన్‌ఎస్‌ఎస్‌లో తనతోపాటు సేవాకార్యక్రమాల్లో పాల్గొన్న హైదరాబాద్‌కు చెందిన ప్రియప్రసన్నకుమార్ రవి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ మేరకు ఆదివారం రూ.20,000 ఆర్థికసాయం అందించారు. బాధిత మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొట్ల రవి, శ్రీను తండ్రి బొట్ల రాజయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న చల్లా ధర్మారెడ్డి